


# పరదేశీ కథలు

## - చిట్టే సిద్ధ లలిత



-83-

# ఎడారి సంధ్యారాగం

కువైట్ సబా హాస్పిటల్లోని బెడ్ పై నిశ్చలంగా పడి వున్నాడు గిరి. శ్వాస పీల్చుకునేందుకు, ఆహారం అందించేందుకు ముక్కులోనూ నోట్లోనూ ట్యూబులు అమర్చిఉన్నాయి. వులుకులేదు పలుకులేదు. అతను అప్పటికి అరవై రోజులనుండి అక్కడే వెంటిలేటర్ పైనే పడివున్నాడు. యాక్సిడెంట్ కేస్ కోర్టులో నడుస్తోంది. భార్య సంధ్య ప్రతిరోజూ ఇద్దరు పిల్లలతోపాటూ వచ్చి అద్దాల తలుపవతల నిలబడి చూసి వెళ్ళిపోతోంది. ఏమీ చెయ్యలేని నిస్సహాయత. ఏదీ చేతకాని అసహాయతతో ఆమె కరిగి కరిగి కన్నీరవుతోంది.

ఆమె హృదయంలో తుఫానులు చెలరేగుతున్నాయి. గట్టిగా దిక్కులు దద్దరిల్లేలా ఏడవాలని వుంది. కానీ ముక్కుపచ్చలారని పిల్లల ముఖాలను చూసి తన దు:ఖాన్ని లోపలే అణచుకుంటోంది. ఇందుకు కారణమైన కువైట్ కుర్రాళ్ళపైన కోపం కట్టలు త్రెంచుకుని ప్రవహిస్తోంది. ఆ ఆకతాయిలు కంటికి కనిపిస్తే కత్తితో కసిదీరా పొడిచి చంపాలనిపిస్తోంది. కానీ ఏమీ చేయలేదు. ఈ కువైట్ దేశంలో తను పరదేశి. ఈ దేశీయులకు వారి చట్టాలు చుట్టాలై సహకరిస్తాయి. కాదూ కూడదంటే దినారాలు వెదజల్లి శిక్షను తప్పించుకోమంటాయి. పరదేశస్తులకు మాత్రం కనికరం లేకుండా కఠినమైన శిక్షలను అమలు చేస్తాయి.

'చట్టమా.. నువ్వు ధనవంతులకు చుట్టమా' న్యాయాన్ని నువు గెలిపించవా. ఇది విధి ఆడే ఆటా, కాలం తీర్చుకునే కక్షా? ఎవర్ని నిందించాలో అర్థం కావడంలేదు.

"అమ్మా.. నాన్న ఎందుకు ఆ బెడ్డుపై పడుకున్నాడు? మన ఇంటికి రాడా?" ప్రశ్నిస్తోంది ఆరేళ్ళపిల్ల ప్రణవి.

అద్దాలలోనుండి కనబడే తండ్రిని కళ్ళార్పకుండా చూస్తూ నాన్న కావాలి, గుర్రం ఆట ఆడుకోవాలి ఏడుపు మొదలెట్టాడు నాలుగేళ్ళ పిల్లోడు ప్రణీత్.

వాళ్ళ ప్రశ్నలకు ఏం జవాబు చెప్పాలో తెలియడం లేదు. డాక్టర్లు మెదడుకు దెబ్బ తగిలింది. ఇప్పుడే ఏమీ చెప్పలేం. కోలుకోవడానికి నెల రోజులు పట్టచ్చు లేదా సంవత్సరం కూడా పట్టచ్చు అంటున్నారు. ఒకవేళ అలా జరగకపోతే ఏం చెయ్యాలి?

గిరి లేని జీవితాన్ని ఊహించుకోలేకుంది సంధ్య. ముందున్న బతుకును తలచుకుంటేనే భయమేస్తోంది. గుండెల్లోంచి తన్నుకొచ్చే దు:ఖం తనువును తడిపేస్తోంది. యాక్సిడెంట్ కేస్ కాబట్టి ట్రీట్మెంట్ అంతా వాళ్ళే చూసుకుంటున్నారు. కేసును పట్టించుకోకుంటే లక్షల రూపాయలు ఇస్తామని ఇప్పటికే బేరసారాలు మొదలు పెట్టారు.

తన దృష్టి గిరి ఆరోగ్యం మీదే వుంది. అతను కోలుకోవాలి. తిరిగి మామూలు మనిషి కావాలి. అదే తన కోరిక. అంత ఉత్సాహంగా తిరుగుతూ గలగలా మాట్లాడుతూ అందరికీ సహాయపడుతూ వుండే గిరికి ఇలా జరగడం అన్యాయం కదా అనిపిస్తోంది.

ఉలిక్కిపడి లేచింది సంధ్య. అంత ఎసి రూములోనూ ఆమె ముఖానికి చెమటలు అలముకున్నాయి. గొంతు తడారిపోయింది. దాదాపూ రెండునెలలు గడిచినా ఇప్పటికీ ఆ దుర్ఘటన కళ్ళముందు నుండి చెరిగిపోలేదు. కంటికి కునుకు రానివ్వడం లేదు.

అంతా ఐదు నిముషాల్లో జరిగిపోయింది. తలచుకుంటే పీడకలలా అనిపిస్తోంది. నమ్మబుద్ధి కావడం లేదు. గిరి లేకుండా ఈ జీవితాన్ని ముందుకెలా నడిపించాలి. పిల్లలిద్దరూ చిన్నవాళ్ళు. నో.. గిరికి ఏమీ కాదు. కోమా నుండి బయటపడతాడు. దేవుడు తనకు అన్యాయం చెయ్యడు. తల విదిలించి లేచి కూర్చుని పిల్లల వైపు చూసింది సంధ్య. ఆదమరిచి నిద్రపోతున్నారు వాళ్ళు.

నాలుగేళ్ళనుండీ కువైట్ లోని ఒక ప్రైవేట్ హాస్పిటల్ లో నర్సుగా పనిచేస్తోంది తను. గిరికి ఈ ప్రమాదం జరగడంతో తను బేంబేలెత్తిపోయి ఉద్యోగానికి ఇక రాలేనని చెప్పేసింది. ఇప్పుడు గిరి రెండు నెలలుగా బెడ్ పై అచేతనంగా పడి వున్నాడు. రెండు నెలల ఇంటి బాడుగ తో పాటూ పిల్లల స్కూలు ఫీజులు ఎలా కట్టాలో? తిండి ఖర్చులు ఎలా సమకూర్చాలో అర్థం కావడం లేదు. కేసు కోర్టులో అలాగే పడి వుంది. యాక్సిడెంట్ చేసిన కువైట్ వాళ్ళు పరిహారం ఎప్పుడు ఇస్తారో ఏమి తేల్చుతారో.

కువైట్ వాళ్ళకి మద్దతుగా నిలిచి గిరిదే తప్పని తీర్పు చెప్పినా ఆశ్చర్యపోనవసరం లేదు. రోజులు నెలలయ్యాయి. గిరి ఎప్పటికి కోలుకుంటాడో అందాకా అనిశ్చితి. ఈ నిశ్శబ్దాన్ని భరించలేకుంది సంధ్య. ఈ పరాయి దేశంలో తన గోడు వినే నాథుడెవ్వరు.

ఎందుకో గట్టిగా ఏడ్వాలనిపించింది. దు:ఖం పొంగుకొచ్చింది. పిల్లలు లేస్తారేమోనని భయపడి తమాయించుకుంది. ఎంతో సరదాగా గడపాలనుకున్న ఆ సెలవు రోజున జరిగిన యాక్సిడెంట్ ను తలచుకుంటేనే వణికి పోతోంది సంధ్య.

"ఈ రోజు నా ఫ్రెండ్స్ పెళ్ళికాని ప్రభాస్, రమణ వస్తున్నారు. పిల్లలతో కలిసి సరదాగా కువైట్ సిటీ బయట వున్న సముద్రపు ఒడ్డుకు వెళదాం. పిల్లల్ని రెడీ చేసి బ్యాగులు సర్దు" చెప్పాడు గిరి.

అందరూ బయటికి వెళ్ళి చాలా రోజులయింది. అందుకే ఉషారుగా తయారయిపోయింది సంధ్య. అందరూ ఉత్సాహంగా కారెక్కారు. కారు మెయిన్ రోడ్ పైకి రాగానే కువైట్ ఆకతాయిలు కారులో వెనకనుండి వచ్చి గిరిని ఓవర్ టేక్ చెయ్యాలని ప్రయత్నించారు.

"అరె మామా నువ్వు సైడు ఇవ్వకురా స్పీడుగా పోనీ" అన్నాడు ప్రభాస్. అంతే ఎక్సలేటర్ బలంగా తొక్కి ఫాస్ట్ గా ముందుకు దూసుకుపోయాడు గిరి. దాంతో వెనక వున్న కువైటీ కుర్రాళ్ళు రెచ్చిపోయారు.

ఎవరైనా టీజ్ చేస్తే వాళ్ళు సహించరు అందులో పర దేశస్తులు. ఇలాంటి సందర్భాల్లో కల్లు తాగిన కోతులే అవుతారు. అందులో వాళ్ళ కారు పేరొందిన బ్రాండ్ క్రిజ్లర్ రాం. ఎలాంటి రోడ్డుపైనైనా సర్రున దూసుకుపోగలదు. ఇలాంటి చిలిపి తగాదాలంటే కుర్రాళ్ళకు మహా ఉత్సాహం.

ముందుకు దూసుకుపోతున్న గిరిని చూసి పట్టుదల పెరిగింది. వెనక నుండి రయ్ మని వచ్చి కారును ఢీ కొట్టే విధంగా పక్కకొచ్చి సడన్ బ్రేక్ వేసాడు వాడు. పరదేశస్తులను చిన్నచూపు చూస్తూ కాస్త ఆట పట్టించడం, బెదిరించడం అలవాటే వాళ్ళకు. అందులో డబ్బు పొగరు, బాధ్యతలేని గారాబం కూడా వారిని చెడు దారిలో నడిపిస్తుంటాయి.

గిరి తక్కువ తినలేదు. డ్రైవింగ్ లో అతనిని మించిన వాళ్ళు లేరు. నవ్వుకుంటూ ఎక్సలేటర్ తొక్కి 140 స్పీడులో ముందుకు వురికాడు. సంధ్య పిల్లలు భయంతో బిగుసుకు పోయారు.

గిరి తెగవ చూసి కువైట్ వాడికి వళ్ళు మండింది. కోపంతో వాడికి కళ్ళు కనిపించలేదు. పళ్ళు పటపటా కొరుకుతూ మీదకి వచ్చేసాడు. పక్కన ఉన్న సంధ్య భయపడుతూ "ఏమండీ వాళ్ళతో పెట్టుకోవద్దు. పక్క వీధిలోకి వెళ్ళి ఆగండి" అంటోంది.

గిరికి కూడా పరిస్థితి అర్థమయి కాస్త భయమేసింది. కువైట్ కుర్రాళ్ళతో పెట్టుకోవడం కొరివితో తల గోక్కోవడమే అవుతుంది. అందుకే కారును మెయిన్ రోడ్డు మీద నుండి పక్క రోడ్డులోకి మళ్ళించి ఆపేసాడు.

"మీరు దిగండి" అన్నాడు కంగారుగా.

సంధ్య పిల్లలు దిగి రోడ్డు పక్కన నిలబడ్డారు. ఈ లోపల యమకింకరుల్లా వదలకుండా వెనుకే వచ్చేసారు కువైట్ కుర్రాళ్ళు. రావడంతోటే ఆగి వున్న గిరి కారును బలంగా ఢీ కొట్టారు.
అలా జరుగుతుందని ఎవరూ ఊహించలేదు. ప్రభాస్, రమణ సీట్ బెల్ట్ పెట్టుకొని వున్నారు. గిరి పిల్లల్ని కిందకి దింపే సమయంలో సీట్ బెల్ట్ తీసేసాడు. అంతే దెబ్బకు కారు మూడు పల్టీలు తిరిగి ఒక పక్కకు పడిపోయింది.
కారు నుజ్జు నుజ్జయింది. ఒక్క నిముషంలో కళ్ళముందే ఏం జరిగిందో అర్థం కాలేదు.
ప్రభాస్, రమణ చిన్న గాయాలతో తప్పించుకున్నారు. కానీ గిరి పరిస్థితి అపాయంలోకి జారింది.
తలకు బలమైన దెబ్బ తగలడంతో గిరి అచేతనంగా మారిపోయాడు. ఇంతలో అంబులెన్స్, పోలీసులు వచ్చేసారు.
గిరిని హాస్పిటల్ కు తీసుకెళ్ళారు.
తలకు దెబ్బ తగిలింది కోమాలోకి వెళ్ళాడు అని డాక్టర్లు చెప్పడంతో కాస్త ఊపిరి పీల్చుకుంది సంధ్య. గిరి మృత్యువునైనా ఎదిరించి బతికి బయటికొస్తాడు అనే నమ్మకం సంధ్యది. డాక్టర్లు రమణకు ప్రభాస్ గాయాలకు కట్లు కట్టి పంపేసారు. గిరిని ఐసియూలో పెట్టారు.
ఆ స్థితిలో గిరిని చూస్తుంటే ఏడుపు ఆగలేదు సంధ్యకు. పిల్లల కళ్ళముందే ఈ యాక్సిడెంట్ జరగడంతో వాళ్ళు భయపడిపోయారు.

సరదాగా గడపాలి అనుకున్న ఆ రోజు దుర్దినమై పోయింది. ప్రతి రోజూ దేవునికి దణ్ణం పెట్టుకుంటూ ఈ రోజైనా గిరి కళ్ళు తెరుస్తాడనే నమ్మకంతో కాలం గడుపుతోంది సంధ్య.
రోజూ సబా హాస్పిటల్ కి వెళ్ళి అద్దాల గదిలో వున్న గిరిని చూసి కన్నీళ్ళు నింపుకుని బరువెక్కిన హృదయంతో తిరిగి వస్తోంది.
ఈరోజో రేపో గిరి స్పృహ లోనుండి బయటికి వస్తాడు. పైకి లేచి మాట్లాడతాడు అనుకోవడం అత్యాసే అయింది.
కాలం రెండు నెలలను తన ఖాతాలో వేసుకుంది. కానీ గిరి ఆరోగ్యం మెరుగు పడలేదు. సరికదా శరీరానికి కావలిసిన ఆహార పదార్థాలను దేనినీ స్వతహాగా తీసుకోలేకపోతున్నాడు కాబట్టి అతనికి ద్రవ పదార్థాలను అందించడానికి గొంతుదగ్గర ఆపరేషన్ చేసి ఆహారనాళాన్ని తెరవాలని డాక్టర్లు నిర్ణయించారు. అందుకు సంధ్య పర్మిషన్ అడిగారు.
విలవిల్లాడిపోయింది సంధ్య. సరేననక తప్పలేదు. మరిన్ని ట్యూబులు అమర్చడంతో గిరిని చూడటానికే భయమేస్తోంది.
రోజురోజుకూ అతని శరీరం ఆ బెడ్ పై క్షీణించి పోతోంది. గడ్డం, జుట్టు బాగా పెరిగాయి.

ఒకరోజు డాక్టర్లు గుండు కొట్టించి గడ్డం తీసేసారు. గిరిని ఆ స్థితిలో చూడాలంటే భయం వేస్తోంది.

ఇండియాలో గిరి తల్లి లక్ష్మమ్మ ఒక్కగానొక్క కొడుకును తలచి రాత్రింబగళ్ళూ రోదిస్తోంది. గుండెలు బాదుకుని ఏడుస్తోంది. బిడ్డ క్షేమం కోసం దేవుళ్ళందరికీ మొక్కుకుంటోంది.

కువైట్ లో వున్న బంధువులు, స్నేహితులు వచ్చి సంధ్యను చూసి ఓదార్చి పోతున్నారు. ఒకరోజు అక్కడ వున్న నర్సు గిరి కళ్ళు తెరిచాడని సంధ్యా సంధ్యా అంటూ కలవరించాడని చెప్పింది.

నర్సు మాటలు విని సంధ్యకు పోయిన ప్రాణం లేచి వచ్చింది. కోమాలో వుండి కూడా తననే కలవరించిన గిరి ప్రేమకు ఆమె కన్నీళ్ళ పర్యంతమయింది. ఇప్పటికైనా అతను కోలుకుంటే తన జీవితంలోకి వెలుగొస్తుందని ఆశించింది. ఆశపడింది.

కువైటీ కుర్రాళ్ళ మీద కేసు నడుస్తోంది. ఆ కుర్రాళ్ళ అమ్మానాన్నలు వచ్చి సంధ్యను కలిసారు. ఎంత డబ్బు కావాలన్నా ఇస్తాం. కేసు విత్ డ్రా చేసుకోమని ప్రాధేయపడ్డారు.

ఒప్పుకోలేదు సంధ్య.

కువైటీస్ తలచుకుంటే అసాధ్యమైనది ఏదైనా వుందా? ఏది ఏమైనా వాళ్ళ కొడుకుల్ని వాళ్ళు కాపాడుకోవడం వాళ్ళకి ముఖ్యం. ఇక సంధ్యతో కుదరదనుకుని డాక్టర్లతో కుమ్మక్కయిపోయారు.

గిరి ఆరోగ్యం కాస్త కూడా మెరుగు పడటం లేదని ఇప్పటికే రెండు నెలలపైగా వైద్యాన్ని అందించామని ఇక కుదరదని అతన్ని ఇండియాకు తీసుకెళ్ళమని సంధ్యకు చెప్పి డాక్టర్లు చేతులు దులుపుకున్నారు.

కాదని గిరిని ఇక్కడే వుంచితే గనుక, రోజుకు లక్షరూపాయలు ఫీజు చెల్లించాలని కూడా హెచ్చరించారు. కృంగిపోయింది సంధ్య. దిక్కుతోచని స్థితి.

చలాకీగా తిరిగే గిరి దీనస్థితిలో నిశ్చలంగా పడి వుండటం జీర్ణం చేసుకోలేని విషయం.

ఈ పరదేశంలో ఇలాంటి కష్టాలు వస్తాయని ఆమె కలనైనా ఊహించలేదు పాపం. గత్యంతరం లేదు. ఏది చేయడానికైనా అది మన దేశం కాదు. ఇక తప్పని పరిస్థితిలో ఇప్పుడు ఆమే ఆ కువైట్ కుర్రాళ్ళ తల్లిదండ్రులకు కబురు పెట్టింది. ఇద్దరూ రాజీ పడటానికి సిద్ధమయ్యారు.

దాదాపూ కోటి రూపాయలు డబ్బు ఇచ్చి గిరిని ఫ్లైట్ లో చెన్నై హాస్పిటల్ కు చేర్చేలా ఒప్పందం చేసుకున్నారు.

ఇల్లు ఖాళీ చేసి రెంట్ బకాయిలు చెల్లించి అవసరమైన సామాన్లు పాక్ చేసుకుని మిగతావన్నీ అక్కడే వదిలేసింది సంధ్య.

పొంగే బడబానలాలను గుండెలో అదుముకుని నిర్లిప్తంగా పిల్లలను, గిరి శరీరాన్ని తీసుకుని మద్రాస్ ఫ్లైట్

ఎక్కింది.

ఆ సమయంలో ఆమె హృదయం సుడిగుండమే అయింది. పెళ్ళయ్యాక ఎన్నో ఆశలతో కువైట్ కి వచ్చి ఇద్దరు పిల్లలను ఇక్కడే కని ఏడేళ్ళ జీవితాన్ని ఈ ఎడారి దేశంలో గడిపి ఈ రోజు అచేతనంగా పడి వున్న భర్తను తీసుకుని తిరిగి స్వదేశానికి వెళుతుంటే గుండె బద్దలయిపోతోంది. పిల్లల ముఖాలు చూస్తుంటే ప్రాణం అల్లాడిపోతోంది. ఆమెకు తోడుగా గిరి ప్రాణ స్నేహితుడు పెళ్ళికాని ప్రభాస్ కూడా వచ్చాడు.

అప్పటికే సంధ్య తల్లిదండ్రులు, గిరి అమ్మ గారు మద్రాస్ ఎయిర్ పోర్ట్ కి చేరుకున్నారు. ఆ స్థితిలో గిరిని చూసి నెత్తి, నోరూ బాదుకుంటూ ఏడ్చారు.

పిల్లలను వాళ్ళ వెంట పంపేసి హాస్పిటల్లో గిరితో పాటూ వుండిపోయింది సంధ్య. ఆమెతో పాటూ ప్రభాస్ కూడా.

గిరి తిరిగి లేవాలని అన్ని దేవుళ్ళకూ మొక్కుతోంది సంధ్య. దిగులుతో, వేదనతో పిచ్చిదానిలా మారిపోయిందామె.

మద్రాస్ లో కూడా నెల రోజులు దాటాయి.

డాక్టర్లు ఎన్ని విధాలా ప్రయత్నించినా లాభం లేకుండా వుంది. తలకు బలమైన దెబ్బ తగలడంతో అపస్మారక స్థితిలోకి వెళ్ళాడని ఏదో అద్భుతం జరిగితే తప్ప తిరిగి యధాస్థితికి రావడం జరగదని, నెలలు పట్టచ్చు లేదా సంవత్సరాలు కూడా గడవచ్చునని తేల్చి చెప్పారు.

అప్పటికే 20 లక్షల రూపాయలు ఖర్చయిపోయాయి. ఫ్రెండ్ గిరి అంటే ప్రాణం పెట్టే ప్రభాస్ కూడా దిగులుతో పిచ్చివాడిలా వున్నాడు.

అద్దాలకవతల గిరి ట్యూబులతో భయం గొలిపేలా కనబడుతుంటే గుండెను చిక్కబట్టుకోవడం అసాధ్యమై పోతోంది.

భయపడినట్లుగానే నాలుగు నెలలు పోరాడి దేహానికి కలిగే ఒత్తిడిని బాధను తట్టుకోలేని గిరి ఒకరోజు శ్వాసను వదిలేసి అనంత వాయువుల్లో లీనమై పోయాడు. ఆ వార్త వినగానే స్పృహతప్పి పడిపోయింది సంధ్య.

ప్రభాసే దగ్గరుండి సంధ్యను చూసుకోవాల్సి వచ్చింది. గిరి దేహాన్ని తీసుకుని ఊరికి బయల్దేరారు.

ప్రపంచం తలక్రిందులయినట్లుంది సంధ్యకు. ఇది తన తలరాత అనుకోవాలా, విధి వక్రించిందనుకోవాలా అర్థం కాలేదు.

గిరి లేని జీవితం శూన్యంగా కనబడుతోంది. దారిలో గోదావరి రాగానే కారును ఆపమని చెప్పి నీళ్ళలో దూకబోయింది సంధ్య. వెనకే ప్రభాస్ పరిగెత్తి సంధ్యను గట్టిగా పట్టుకున్నాడు. భరించలేని వేదనతో వదలమని గింజుకుంది సంధ్య.

"నీకేమైనా పిచ్చి పట్టిందా. నువ్వు కూడా చనిపోతే పిల్లలేమవుతారు?" అంటూ ఆమెను దగ్గరికి లాక్కుని రెండుచేతులతో కదలకుండా బంధించాడు ప్రభాస్. ఏడుస్తూ అతని ఎదపై తలవాల్చింది సంధ్య. జీవితం ఎప్పుడు ఏ మలుపులు తిరుగుతుందో నుదిటి రాతను లిఖించిన ఆ విధాతకే తెలుసు మరి.

*(మరోకథ వచ్చేనెలలో)*

Post your comments